



పుంగనూరు కోసం బలి

సీజీ ప్రాజెక్టుకు చేరని హంద్రీనీవా నీరు

- మంత్రి పెద్దిరెడ్డి స్వార్థం.. జిల్లా నాయకుల నిర్లక్ష్యం
- గాలిలో కలిసిపోయిన సీఎం జగన్ హామీ
- ఆవేదన చెందుతున్న తనకల్లు మండల ప్రజలు

పుంగనూరు బాగుంటే చాలని అధికార పార్టీ పెద్ద మనిషి అనుకున్నారు. కళ్లెదుటే నీరు తరలుతున్నా.. తమ గొంతులెండుకు తడవడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఓట్లేసిన ప్రజలకు న్యాయం చేయాల్సిన అధికార పార్టీవారు చేష్టలుడిగి చూస్తున్నారు. మొత్తంగా.. పొరుగు జిల్లాకు హంద్రీనీవా నీటిని తరలించేందుకు కరువు జిల్లాకు ద్రోహం చేస్తున్నారు. ఇన్‌చార్జి మంత్రి, అధికార పార్టీలో కీలకమైన నాయకుడు దీని వెనుక ఉండటంతో జిల్లాలోని వైసీపీ ప్రజాప్రతినిధులు ప్రశ్నించే సాహసం చేయడం లేదు. ఈ కారణంగా తనకల్లు మండలంలోని కీలకమైన చెన్నరాయగుడి ప్రాజెక్టుకు నీరు అందడం లేదు. సీజీ ప్రాజెక్టులో నీరుంటే మండలంలోని 75 శాతం గ్రామాలకు తాగునీరు అందుతుంది. భూగర్భ జలాలు పెరిగి.. సాగునీటి సమస్య పరిష్కారమౌతుంది. సీజీ ప్రాజెక్టు పొంగి పొర్లి.. పాపాఘ్ని నది ప్రవహిస్తే ఈ ప్రాంతం పచ్చదనంతో కళకళలాడుతుంది. సీజీ ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో నింపుతామని సీఎం జగన్ గతంలో హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ప్రాజెక్టుకు చుక్కనీరు ఇవ్వలేదు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్తూరు జిల్లాకు హంద్రీనీవా నీటిని తరలించడానికి జిల్లా ప్రయోజనాలకు గండికొడుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. - తనకల్లు

తనకల్లు మండలంలోని కొక్కంటి పెద్దచెరువు, కొక్కంటి చెరువు, పాపాగ్ని నది, చిన్నా చితక కుంటలు నీరు లేక వెలవెల బోతున్నాయి. ఇదేమీ జిల్లా ప్రజా ప్రతినిధులకు, కదిరి ఎమ్మెల్యేకు పట్టడం లేదు. కదిరి ఎమ్మెల్యేగా సిద్దారెడ్డి ఎన్నికయ్యాక మండలంలో అవకాశమున్న చెరువులకు హంద్రీనీవా నీటిని తెచ్చారు. కానీ ఆ తరువాత చెరువులు ఎండిపోతున్నా పట్టించుకోవడం లేదు. సీజీ ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని తరలించడానికి మొగిలిచెట్ల తండా, రామ్లానాయక్ తండా, ఉంగరాలవారిండ్లు తదితర ప్రాంతాల్లో భూసేకరణ చేయాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. కానీ కాలువ పనులను నాలుగు నెలల క్రితం ప్రారంభించి.. రాళ్లు పడటంతో అర్ధంతరంగా ఆపేశారు. ఆ తరువాత అతీగతి లేదు. ఎన్నికలు సమీపించినందున.. ఇక ఈసారి కూడా పాత హామీనే వైసీపీ నాయకులు ఇచ్చుకోవచ్చు..!


కాలువలో రాళ్లు

ఎంతో ఉపయోగం..

సీజీ ప్రాజెక్టుకు నీరు చేరితే తనకల్లు మండలంలోని ఈతోడు, సీఆర్ పల్లి, తనకల్లు, కొక్కంటి, కోర్తికోట, చెక్కవారిపల్లి, టిసదుం, బాలసముద్రం, దిగువతొట్లిపల్లి, గేమేనాయక్ తండా, తవళం పంచాయతీ పరిధిలో వందలాది బోరు బావులు జీవం పోసుకుంటాయి. వ్యవసాయానికి పుష్కలంగా నీరు అందుతుంది. ఈ ప్రాజెక్టును ఒకసారి నింపితే అధికారికంగా 900 ఎకరాలకు సాగు నీరు అందుతుంది. అనధికారికంగా మరో రెండు వందల ఎకరాలు సాగవుతాయి. ఇంతటి కీలకమైన ప్రాజెక్టుకు నీరు తేవాలన్న ఆలోచన అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చేయడం లేదు. తనకల్లు మండలం మీదుగానే హంద్రీనీవా నీరు మంత్రి పెద్దిరెడ్డి నియోజకవర్గంలోని పుంగనూరుకు, చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు తరలిపోతోంది. కళ్లెదుటే నీరు తరలుతున్నా.. జిల్లా ప్రజాప్రతినిధులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

నీటి కొరత ఉండదు..

ముండ్లవారిపల్లి సమీపంలో ఉన్న సీజీ ప్రాజెక్టులో నీరుంటే మా పంచాయతీ పరిధిలోని 225 వ్యవసాయ బోర్లు జీవం పోసుకుంటాయి. నీటి కొరతే ఉండదు. పంటలు బాగా పండుతాయి. ఎన్టీఆర్ హయాంలో ఈ ప్రాజెక్టులోకి నీరు చేర్చేందుకు కాలువకు సర్వే నిర్వహించి, రాళ్లు పాతారు. కానీ ఆ కాలువను తప్పించి, ప్రాజెక్టులోకి నీరు రాకుండా చేశారు. సీజీ ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో అనుసంధానం చేయాలి.

- లక్ష్మీపతి, రైతు, చిన్నరామన్నగారిపల్లి



మా మండలానికి జీవనాడి..

తనకల్లు మండలానికి జీవనాడి సీజీ ప్రాజెక్టు. అందులో నీరుంటే మండలంలోని 10 పంచాయతీల్లో నీటి సమస్య ఉండదు. సీజీ ప్రాజెక్టుకు అధికారికంగా హంద్రీనీవా నీటిని కేటాయించాలి. వెంటనే ప్రాజెక్టును హంద్రీనీవా నీటితో నింపాలి. మంత్రి పెద్దిరెడ్డి స్వప్రయోజనాల కోసం మండల రైతులకు అన్యాయం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి.

- చిన్నప్ప, రైతు, వంకపల్లి




పొంగి పొర్లుతున్న సీజీపీ(ఫైల్)

రూ.2.75 కోట్లు మంజూరు..

సీజీ ప్రాజెక్టుకు హంద్రీనీవా నీటిని తరలించే కాలువ పనులకు రూ.2.75 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. మొగిలిచెట్ల తండా వద్ద నుంచి ప్రాజెక్టు వరకు కాలువ నిర్మాణం చేపట్టడానికి ఆరు ఎకరాల భూమి అవసరం. ఎకరం రూ.7 లక్షల ప్రకారం ధర నిర్ణయించి, ప్రభుత్వానికి నివేదికలు పంపాం. అనుమతులు రాగానే టెండర్లను నిర్వహిస్తాం.

- బయ్యప్ప, ఏఈ, చిన్న నీటిపారుదల శాఖ, తనకల్లు

పులిపిరి ఆకు పసరుతో మటుమాయం

అనంతపురం జిల్లా : అందమైన శరీరంపై పులిపిర్లు వచ్చి ఎంతగానో చింతిస్తున్నారా? అయితే ఇప్పుడు ఆ దిగులు అవసరం లేదు అంటున్నాడు మన సేవా రత్న, విశిష్ట పురస్కారం మరియు జాతీయ స్థాయిలో "వైద్యశ్రీ" అవార్డ్స్ అందుకున్న వడియార మల్లిఖార్జునుడు.



వైద్యానికి దారి తీసిన విధానం

గతంలో ఈ మల్లికార్జునరావు ఒక వైద్యుని దగ్గర సహాయకుడు. అతనికి పులిపిర్లు అధికంగా వుండేవి. సదరు వైద్యులను సంప్రదించినా ఫలితం లేదు కదా అవి ఇంకా వృద్ధిచెందేవి. తీరా శ్రీశైలం అడవులనందు ఎవరో వైద్యుడు ఈ పులిపిర్లకు వైద్యం అందిస్తున్నారు అని తెలిసింది. త్వరితగతిన అక్కడికి వెళ్లగా పులిపిర్లు మటుమాయం. ఆ క్షణం నుండి ఈ మల్లికార్జునుడు శ్రీశైలంలోని ఆ పులిపిర్ల వైద్యుని వెంటపడి తను కుదరదు అన్న వినకుండా అన్నిరకాలుగా ఈ వైద్యాన్ని అవపోసన పట్టించాడు. తన గురువుగారు తనువు చాలించాక ఇప్పుడు తన శిష్యుడైన ఈ మల్లి అదే వైద్యాన్ని కొనసాగిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా తన వైద్య సేవలు అందిస్తున్నాడు.

11, 12, 13 తేదీల్లో అనంతపురం జిల్లా లోని, కీర్తి రెసిడెన్సి, కమలానగర్, DCMS రోడ్, అనంతపురం నందు వైద్యం. ఒక్క చిన్న పులిపిరికి కేవలం రూ. 100/- మాత్రమే, పెద్దపులిపిరికి (సైజును బట్టి చార్జి చేయబడును). ఈ పులిపిరి వైద్యం షుగర్ వ్యాధి ఉన్నవారు కూడా చేయించుకోవచ్చును. ఉదయం 9.00 గం. నుండి సాయంత్రం 6 గం. వరకు ఈ వైద్యసేవలు అందించబడును. అపాయింట్‌మెంట్స్ కొరకు ఫోన్ నం.: **9849628485**ను సంప్రదించగలరు. ఒక వేల ఈ క్యాంపుకు రాలేక పోయినవారు హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో గల మా క్లీనిక్ లో వచ్చి వైద్యం చేయించుకోగలరు ఫోన్ నం. **9440251969** మరిన్ని వివరాలకు youtube: pulipiri mallikarjun లో చూడండి

మల్లి చేతిలో దివ్యమైన మూలికలు

సాధారణంగా 7 రకాలుగా కనిపించే ఈ పులిపిర్లు మనిషి శరీరంపై ఎక్కడైనా రావచ్చు. "హ్యూమన్ పాపిలోమా వైరస్" కారణం ద్వారా మరియు వంశపారంపర్యంగా కూడా ఈ పులిపిర్లు రావచ్చు. అయితే ఏ రకమైన పులిపిరినైనా సరే తను సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది మరుక్షణం కట్‌చేస్తాడు. అనంతరం అదే పొడిని మరలా తీసిన ప్రదేశంలో అద్దుతాడు. అంతే వైద్యం అయిపోయింది. తన 20 సం॥ల అనుభవంతో సామాన్యుల నుండి ప్రముఖులు కొన్ని వేల మంది ఈ వైద్య సేవలు పొందారు. ఈ వైద్యం మనకు అందుబాటులో వుండటం మనం గర్వించదగ్గ విషయం.

జగన్ అరాచకాలపై లోకేశ్ శంఖారావం

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే

పెనుకొండ, ఫిబ్రవరి 10 : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల అరాచకాలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ పూరించిన నాదమే శంఖారావమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర లో పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో లోకేశ్ పర్యటించి, జగన్ ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలకు వివరిస్తారన్నారు. నిరుద్యోగంతో యువత, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించడానికే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. రానున్న 40, 50రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గా ల్లో లోకేశ్ పర్యటిస్తారన్నారు. రోజుకు మూడు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తార న్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను ముఖాముఖి సమావేశాల ద్వారా తెలుసు కుంటారని తెలిపారు. యువగళం పాదయాత్ర ద్వారా రాష్ట్రంలోని గ్రామాలు, పట్టణాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ అనాలోచితన నిర్ణయాలపై గొంతెత్తి ప్రజలకు మద్దతుగా నిలిచారన్నారు. శంఖారావం కార్యక్రమం ద్వారా కార్యకర్తలు నేరుగా నారా లోకేశ్‌తో తమ అభిప్రాయాలు పంచుకునే అవకాశం ఉంటుందన్నారు.

లోకేశ్ శంఖారావంతో వైసీపీలో వణుకు : పల్లె

పుట్టపర్తి, ఫిబ్రవరి 10: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చేపట్టనున్న శంఖారావంతో వైసీపీలో వణుకు మొదలైందని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లోకేశ్ మొదట చేపట్టిన యువ గళం పాదయాత్రతో రాష్ట్రంలో వైసీపీ అవినీతిని ఎండగట్టడమే గాక .. పార్టీలో నూతనోత్తేజాన్ని తీసుకొచ్చారన్నారు. మళ్లీ ఈనెల 11 వ తేదీ ఆదివారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 120 నియోజకవర్గాల్లో 50 రోజుల్లో సమర శంఖారావం పేరిట మరో యాత్ర నిర్వహించనున్నారన్నారు. దీంతో వైసీపీకి ఓటమి భయం పట్టుకుందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ సీఎం జగన్ ఢిల్లీకి వెళ్లి ప్రత్యేక హోదా పేరుతో హైడ్రామాకు తెరలేపారని విమర్శించారు. వైసీపీ అరాచక పాలనతో ప్రజలు విసుగు చెందారని, ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఎప్పుడు వైసీపీని ఇంటికి పంపుదామా ఎదురుచూస్తున్నారని పల్లె పేర్కొన్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం : కలెక్టర్

పుట్టపర్తి, ఫిబ్రవరి 10: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ప్రణాళికలు, ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ అరుణ్ బాబు వివరించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ ఎన్నికల నిర్వహణపై శనివారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీసీలో పాల్గొని ఎన్నికల నిర్వహణకు జిల్లాలో తీసుకుంటున్న ప్రణాళికలు, ఏర్పాట్ల గురించి వివరించారు. మొదటి దఫాలో అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చామన్నారు. అలాగే అన్ని పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్ల వసతులు కల్పిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్ కుమార్, డీఆర్వో కొండయ్య, పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, ఆర్డీఓ భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

విద్యావైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ

రాష్ట్రస్థాయికి ఎనిమిది ప్రాజెక్టుల ఎంపిక

కొత్తచెరువు, ఫిబ్రవరి 10: పుట్టపర్తి మండలం జగరాజు పల్లి వద్ద గల మంగళకర పాఠశాలలో శనివారం 2022- 23వ విద్యా సంవత్సరానికి సంబంధించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైయిర్ విద్యావైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించినట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. ఈ ప్రదర్శనలో జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు రూపొందించిన 87 ప్రాజెక్టులకు గాను 84 ప్రాజెక్టులు ప్రదర్శించామన్నారు. ఇందులో 8 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయన్నారు. ఈ ప్రదర్శన కేంద్ర పరిశీలకులు శుభ్రత్ పర్యవేక్షణలో జరిగింద న్నారు. సాకే నవ్య(కనుముక్కల జిల్లాపరిషత్ పాఠశాల), ఆంజనేయులునాయక్ (కొండకమర్ల ఉన్నత పాఠశాల), జి.చరణ్యారెడ్డి(తోటగేరి ఉన్నతపాఠశాల, పెనుకొండ), నిఖిల(ధనాపురం ఉన్నతపాఠశాల), ఏ.దివ్య(కుంటిమద్ది ఉన్నతపాఠశాల), లిఖిత(కొత్తచెరువు బాలికల ఉన్నత పాఠశాల), ఎం.ప్రేమ్‌కుమార్ (మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల, పేరూరు), వంశీకుమార్(తరగకుంట ఉన్నతపాఠశాల) రూపొందించిన ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు విద్యాశాఖ అధికారులు ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏడీ-1 నాగరాజు, ఏడీ-2 రామకృష్ణ, డీవైఈఓ వెంకటరమణ, సంస్కృతీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సెంథిల్ కుమార్, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఇక చైతన్య రథయాత్ర

ప్రజల్లోకి వెళ్లి సమస్యలను తెలుసుకుంటాం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్


విలేకరులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ధర్మవరం, ఫిబ్రవరి 10: పాదయాత్ర ద్వారా నియోజకవర్గ సమస్యల్ని తెలుసుకుని, ప్రత్యేక మేనిఫెస్టో రూపొందించామని, తాజాగా మరో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలోని ఒక్కో మండలానికి ఒక్కో చైతన్య రథాన్ని ఏర్పాటు చేశామని, వాటి ద్వారా గ్రామాల్లో టీడీపీ తరఫున విస్తృత ప్రచారం చేస్తామని, ప్రజల సమస్యలను తెలుసుకుంటామని అన్నారు. చాలామంది ధైర్యంగా తమ సమస్యలను బయటకు చెప్పలేకపోతున్నారని, అలాంటి వారి కోసం చైతన్య రథానికి వెనుకవైపున వినతుల బాక్స్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. సైకిల్ గర్వంగా ప్రజల ముందుకు వస్తోంది అని చెప్పేందుకు చైతన్య రథంపై ఒక సైకిల్‌ను ప్రదర్శిస్తానమి వెల్లడించారు.

- ***నిజం గెలవాలి*** కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14న బత్తలపల్లి మండలం సంజీవపురం గ్రామానికి నారా భువనేశ్వరి వస్తున్నారని పరిటాల శ్రీరామ్ తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు తరువాత రాష్ట్రంలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారని, వారి కుటుంబాలను ఓదార్చి, ఆదుకునేందుకు ఆమె యాత్ర చేపట్టారని అన్నారు. గతంలో ఎన్నడూ రాజకీయాల్లో జోక్యం చేసుకోని నారా భువనేశ్వరి, వైసీపీ నాయకుల అరాచకం కారణంగానే బయటకు వస్తున్నారని అన్నారు. కష్టాల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలను ఆదుకునేందుకు ఆమె స్వయంగా వస్తున్నారని, ఈ యాత్రను విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు.
- ***శంఖారావం*** పేరుతో నారా లోకేశ్ మరోసారి ప్రజల్లోకి వస్తున్నారని అన్నారు. గతంలో యువగళం పాదయాత్ర ద్వారా అన్ని వర్గాలను కలుసుకుని, వారిలో ధైర్యం నింపారని అన్నారు. చంద్రబాబు అరెస్టు తరువాత ఆ పాదయాత్రకు కొంత బ్రేక్ పడిందని, ఆ తరువాత పరిణామాలతో హడావుడిగా యాత్రను ముగించాల్సి వచ్చిందని అన్నారు. అందుకే పాదయాత్ర చేయని నియోజకవర్గాల మీదుగా ఇప్పుడు శంఖారావం ఉంటుందని తెలిపారు. ప్రతి రోజు మూడు నియోజకవర్గాలు చొప్పున నారా లోకేశ్ పర్యటిస్తారని అన్నారు. లోకేశ్ ఈ ప్రకటన చేసిన తరువాత వైసీపీ గుండెల్లో వణుకు మొదలైందని అన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు ఫణికుమార్, తలారి చంద్రమోహన్ బాబు, నాగూర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు ఇస్తారా లేదా..?

మంత్రి భర్తను నిలదీసిన జనం


వైసీపీ నాయకుడు చరణ్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న నాయకులు, ప్రజలు

గోరంట్ల, ఫిబ్రవరి 10: పార్టీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వస్తున్న మంత్రి ఉష శ్రీచరణ్ భర్త చరణ్ రెడ్డిని గోరంట్ల మండలం పాలసముద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజలు శనివారం అడ్డుకున్నారు. నాసిన్ కోసం భూములు ఇచ్చిన రైతులు, స్థానికులు నివాసాలను కోల్పోయారని, వారిని ఆదుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సర్వే నంబర్ 125లోని 6.74 ఎకరాల ప్రభుత్వ స్థలంలో బాధితులు గుడిసెలు వేసుకున్నారు. అక్కడ ఇళ్ల నిర్మాణ పనులకు అధికార పార్టీ స్థానిక నాయకులు ఆటంకాలు కల్పిస్తున్నారని అన్నారు. బాధితులైన 350 మందికి ఇంటి పట్టాలు ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు హనుమయ్య డిమాండ్ చేశారు. దీంతో ఎన్నికల తరువాత అధికారంలోకి వస్తే పట్టాలను ఇప్పిస్తామని చరణ్ రెడ్డి అన్నారు. అలా కుదరదని, ఎన్నికల లోపు న్యాయం చేయాల్సిందేనని కోరుతూ వారు వినతిపత్రాన్ని అందించారు. సమస్యను పరిష్కరించకపోతే పేదల సత్తా ఏమిటో రుచి చూపిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కొండా వెంకటేష్‌లు, ఇంటి స్థలాల సాధన కమిటీ కార్యదర్శి వజీర్ తదితరులు పాల్గొన్నారు.



అంకితభావమే విజయ రహస్యం

సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ అమానుల్లా
జేఎన్‌టీయూలో యువ న్యాయవాదుల వర్క్‌షాప్
హాజరైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ భట్టి, జస్టిస్ మిశ్రా



అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 10: వృత్తిపట్ల అంకిత భావంతో పనిచేస్తేనే కేసులలో విజయం దక్కుతుందని, కక్షిదారులకు న్యాయం చేయగలరని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా అన్నారు. జేఎన్‌టీయూలో శనివారం నిర్వహించిన యువ న్యాయవాదుల వర్క్‌షాప్‌నకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సారథ్యంలో రాష్ట్ర బార్ కౌన్సిల్, అనంతపురం జిల్లా బార్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. గౌరవ అతిథులుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, ఎస్‌వీఎన్ భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ అమానుల్లా మాట్లాడుతూ, పౌర హక్కులు హరించబడితే దేశ స్థిరత్వంపై ప్రభావం పడుతుందని అన్నారు. దేశాభివృద్ధిలో అన్ని రంగాలు సమానపాత్ర పోషిస్తాయని, వాటి పరిరక్షణకు న్యాయవ్యవస్థ నిరంతరం పనిచేస్తుందని అన్నారు. న్యాయ విద్యార్థి నుంచి న్యాయమూర్తి వరకు న్యాయవ్యవస్థలో కుటుంబ సభ్యులని అన్నారు.



దేశ నిర్మాణంలో మీరే కీలకం: జస్టిస్ భట్టి



న్యాయవాదులు ప్రజాస్వామ్యంలో భాగస్వామ్యమని జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. సుసంపన్నమైన దేశాన్ని నిర్మించడంలో న్యాయవాదుల పాత్ర కీలకమని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ న్యాయవాది కావడంతో మహోన్నతమైన రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. రాజ్యాంగం దేశానికి స్థిర పాలనను అందిస్తుందని అన్నారు. పరిశ్రమలు, నీటిపారుదల, పరిశోధనలు, వ్యవసాయ భూములు దేశ సంపద సృష్టికి మూలాలని అన్నారు. న్యాయమూర్తులు, లాయర్స్, అడ్వకేట్స్, న్యాయ విద్యార్థులు దేశ నిర్మాణంలో ముఖ్య పాత్రపోషించాలని పిలుపునిచ్చారు. ప్రతి న్యాయవాదీ వృత్తి పట్ల అవగాహన పెంచుకోవాలని సూచించారు. పౌరుల హక్కులను పరిరక్షించే బాధ్యత న్యాయవాదులపై ఉందని అన్నారు.

గెలవగలననే నమ్మకం ఉండాలి: జస్టిస్ మిశ్రా

ఫైల్‌ను పూర్తిగా చదివినప్పుడే న్యాయవాది కేసును సక్రమంగా వాదించగలరని జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అన్నారు. లేకుంటే కోర్టు సమయాన్ని వృథా చేసినవారు అవుతారని అన్నారు. న్యాయవాదులకు కేసును జయించగలనన్న నమ్మకం ఉండాలని అన్నారు. అందుకు సానుకూల వాతావరణాన్ని సృష్టించుకోవాలని సూచించారు. అప్పుడే న్యాయ నిర్ణేత సహకారం లభిస్తుందని అన్నారు. నేడు సాంకేతిక పరిజ్ఞాన వినియోగం పెరిగిందని అన్నారు. కంప్యూటర్ ద్వారా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) అభివృద్ధిపరిచిన ప్లాట్‌ఫామ్‌లో అన్నింటికీ సమాధానం లభిస్తోందని అన్నారు. దీంతో కట్ అండ్ కాపీ పేస్ట్ పద్ధతిలో సులువుగా సారాంశాన్ని పొందుపరుస్తున్నారని అన్నారు. కొన్ని దశాబ్దాల క్రితం కేస్ ఫైల్‌ను క్షుణ్ణంగా చదివి, రాసేవారమని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రక్రియ సబ్జెక్టుపై పట్టుసాధించేలా చేసేదని అన్నారు. అనవసర విషయాలను మెదడులో చొప్పించకుండా, ప్రతిరోజూ ఒక అంశంపై సొంతంగా ప్రాక్టీస్ చేయడం అలవర్చుకోవాలని న్యాయవాదులకు సూచించారు.





ఘన సత్కారం

వర్క్‌షాప్‌లో రాష్ట్ర హైకోర్టు న్యామూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ దుర్గాప్రసాద్ రావు, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ మన్మథరావు, జస్టిస్ శ్రీనివాసరెడ్డి, జస్టిస్‌శ్యామ్‌సుందర్, జిల్లా కోర్టు న్యాయాధికారి శ్రీనివాస్ న్యాయ విద్యార్థులకు వృత్తి నిబద్ధత గురించి వివరించారు. వర్క్‌షాప్‌నకు హాజరైన న్యాయూర్తులను జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. బీసీఐ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆలూరు రామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌నకు బీసీఐ చైర్మెన్ ప్రభాకరన్, వైస్ చైర్మన్ మనోజ్ కుమార్, కో చైర్మెన్ శ్రీనాథ్, సభ్యులు ప్రశాంత్ కుమార్ సింగ్, దిలీప్ పటేల్, విష్ణువర్ధన్ రెడ్డి, ప్రతాప్ సింగ్, డీకే శర్మ, భక్త భూషన్, ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు, వైస్ చైర్మన్ రామజోగేశ్వర రావు, సభ్యులు క్రిష్టారెడ్డి, చిదంబరం, చెన్నకేశవరెడ్డి, బ్రహ్మారెడ్డి, ద్వారకానాథ్ రెడ్డి, శ్రీనివాసరావు, క్రిష్ణమోహన్, బ్రహ్మానందరెడ్డి, వెంకటరామిరెడ్డి, రఘువీర, నరసింహారావు, నాగిరెడ్డి, నాగేశ్వరరావు, సుదర్శనరావు, రాష్ట్రంలోని పలువురు లాయర్లు, అడ్వకేట్లు, న్యాయ విద్యార్థులు హాజరయ్యారు.



స్వాగతం..



న్యాయ విద్యార్థులు



గాన కచేరి..



పటిష్ట బందోబస్తు

సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల పర్యటనకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. జేఎన్‌టీయూ నుచి నగరం వైపు దాదాపు మూడు కిలోమీటర్ల వరకు బందోబస్తు ఏర్పాటు చేశారు. వర్క్‌షాప్‌కు రాష్ట్రం నలమూల నుంచి వందలాది మంది న్యాయవిద్యార్థులు, న్యాయవాదులు తరలివచ్చారు. ప్రముఖల ప్రసంగం అనంతరం మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. మధ్యలోనే భోజనం అయిపోవడంతో చాలామంది ఆకలితో ఇబ్బంది పడ్డారు. రెండో శనివారం కావడంతో జేఎన్‌టీయూ చుట్టుపక్కల హోటళ్లను కూడా మూసేశారు.

అడ్డుకున్న ఇంటెలిజెన్స్?

సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులకు తమ సమస్యలను చెప్పుకోవాలని కొందరు న్యాయవాదులు తలిచారు. వర్క్‌షాప్ మధ్యలో నిరసన తెలపాలని భావించారు. దీన్ని పసిగట్టిన ఇంటెలిజెన్స్, అప్రమత్తంగా వ్యవహరించింది. ముందురోజే వారిని వర్క్‌షాప్‌నకు రాకుండా అడ్డుకున్నట్లు తెలిసింది.



లేపాక్షి శిల్పకళా సంపద అమోఘం

సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అమానుల్లా, జస్టిస్ భట్టి

హిందూపురం, ఫిబ్రవరి 10: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్పకళా సంపద అమోఘమని సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ వెంకటనారాయణ భట్టి అన్నారు. లేపాక్షిలోని ఆలయాన్ని శనివారం వారు సందర్శించారు. న్యాయమూర్తులకు ఆలయ వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో శిల్ప సంపద ప్రత్యేకతలను వారికి గైడ్స్ వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, సీతాదేవి పాదం, నాట్యమండపం, అర్ధంతరంగా ఆగిన కల్యాణమండపం, వేలాడే స్థంభాన్ని చూసి న్యాయమూర్తులు తన్మయత్వం చెందారు. అప్పటి శిల్పుల నైపుణ్యానికి లేపాక్షి ఆలయమే నిదర్శనమని కొనియాడారు. అనంతరం ఆలయంలో దుర్గావీరభద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. న్యాయమూర్తులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించి, లేపాక్షి ఆలయ చిత్రపటాన్ని బహూకరించారు.



జిల్లా న్యాయవాదులు





వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేయాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 10 : ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 25వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ 2024 డీఎస్సీలో కేవలం 6,100 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు అతి తక్కువ పోస్టులు ప్రకటించారని, అందులోనూ వ్యాయామ ఉపాధ్యాయులకు స్థానం కల్పించలేదని విమర్శించారు. విద్యాహక్కు చట్టంలో భాగంగా ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్‌లో డీఎస్సీ ద్వారా పీఈటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వ్యాయామ ఉపాధ్యాయ నిరుద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా 80వేల మంది ఉన్నారని, "ఆడుదాం ఆంధ్రా" పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆటల పోటీలు నిర్వహించడం కన్నా పీఈటీ పోస్టులు భర్తీ చేస్తే క్రీడాకారులు తయారవుతారన్నారు.

రియా ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న రియా వైద్యులు

విడపనకల్లు, ఫిబ్రవరి 10: మండల కేంద్రంలో శనివారం ఉదయం అనంతపురం రియా ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రియా వైద్యు లు ఉదయ్‌కుమార్, గీతా స్వర్ణ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడు తూ ఉంటారని, వారికి ఉన్న వ్యాధులను గుర్తించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యంగా బీపీ, షుగర్ వంటి వాటిని పరీక్షించి తగిన మందులు, జాగ్రత్తలు అందజేస్తామన్నారు. వైద్య శిబిరంలో 600 మందికిపైగా పరీక్షించి, అవసరమైనవారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రియా ఎండీ లక్ష్మీప్రసాద్, సీఈఓ మురళీకృష్ణ వైద్య శిబిరాన్ని పర్యవేక్షించారు. రియా వైద్యులు శివా, ఆసుపత్రి సిబ్బంది వైద్యం అందించారు. టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, సర్పంచ్‌లు తిప్పారెడ్డి, చంద్రశేఖర్, జనార్దన నాయుడు, నాయకులు సినిమా రామాంజనేయులు, భీమలింగప్ప, హనుమంతు, రంగస్వామి, భాస్కర్‌నాయుడు, అశోక్‌కుమార్, రాజుస్వామి, నూతేటి రామక్రిష్ణ, జయరాములు, ఆర్ కొట్టాల శ్రీనివాసులు పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా కేసులో ఆరుగురి అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ

తాడిపత్రి, ఫిబ్రవరి10: పశువులను అక్రమంగా తరలిస్తున్న కంటైనర్ బోల్తాపడ్డ సంఘటనలో ఆరుగురు నిందితులను అరెస్ట్ చేశామని అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 6న 49ఎద్దులు, ఆవులతో వెళుతున్న కంటైనర్ పెద్దవడుగూరు మండలం కాశేపల్లి టోల్‌ప్లాజా వద్ద బోల్తాపడ్డ ప్రమాదంలో ఇద్దరు కూలీలు, 36 ఆవులు, ఎద్దులు మృతి చెందిన ఘటనలో విచారణ జరిపామన్నారు. హర్యానా రాష్ట్రం పత్వాల్ జిల్లా కోట్ గ్రామానికి చెందిన కంటైనర్ డ్రైవర్ వాహిద్, తెలంగాణా రాష్ట్రం హైదరాబాద్‌లోని చార్మినార్‌కు చెందిన మహమ్మద్‌ఫిరోజ్ ఖురేషి, రంగారెడ్డిజిల్లా కందుకూరు మండలం నీద్‌నూర్ గ్రామానికి చెందిన కంటైనర్ యజమాని మహమ్మద్ అజముద్దీన్, సత్యసాయి జిల్లా హిందూపురంలోని మోడల్ కాలనీకి చెందిన ఖురేషిటిప్పు, కడపజిల్లా పులివెందులలోని పురుషోత్తంరెడ్డి కాలనీకి చెందిన నాగేంద్ర, అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం ఇల్లూరుకుచెందిన నల్లప్పలు కలిసి పశువుల అక్రమ రవాణాలో నిందితులుగా ఉన్నారన్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి తక్కువ ధరలకు పశువులను కొనుగోలు చేసి అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకొనే వారన్నారు. ఒడిస్సా రాష్ట్ర సరిహద్దు ప్రాంతం నుంచి ఆవులు, ఎద్దులను కొనుగోలు చేసేవారన్నారు. వీటిని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట వద్ద బొలెరోలో 4నుంచి 5పశువులను ఎక్కించి ఏలూరు జిల్లా ఏవూరు హనుమాన్ జంక్షన్‌కు తరలించారన్నారు. అక్కడి నుంచి ఖురేషిటిప్పు ద్వారా బెంగళూరు, కేరళకు తరలించే ప్రయత్నంలో ఈ ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంపై ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ గంగయ్య ఆధ్వర్యంలో యాడికి సర్కిల్ సీఐ రోషన్, పెద్దవడుగూరు ఎస్ఐ శ్రీనివాసులు గాలింపు చర్యలు చేపట్టి వారిని అరెస్ట్ చేశారన్నారు. ట్రైనీ డీఎస్పీ హేమంత్‌కుమార్, డీఎస్పీ గంగయ్య పాల్గొన్నారు.

కిడ్నాపైన వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షం

● భూమిని తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయించమని వైసీపీ నాయకులు ఒత్తిడి చేశారు ● విలేకరుల ఎదుట బాధితుడి వెల్లడి

ధర్మవరం, ఫిబ్రవరి 10: కిడ్నాపైన వ్యక్తి పోలీస్ స్టేషన్లో ప్రత్యక్షమయ్యాడు. బత్తలపల్లి మండలం గంటాపురంగ్రామానికి చెందిన అక్కిం లక్ష్మయ్య పెద్దకుమారుడు పెద్దప్పయ్య కిడ్నాప్ విషయం శుక్రవారం ధర్మవరంలో కలకలం రేపిన సంగతి తెలిసిందే. అయితే శనివారం పెద్దప్పయ్య స్థానిక వన్‌టౌన్‌పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యక్షమయ్యాడు. పోలీస్‌స్టేషన్‌లో ఉన్న పెద్దప్పయ్యను కిడ్నాప్‌పై విలేకరులు ఆరాతీశారు. పెద్దప్పయయ్య విలేకరులతో మాట్లాడుతూ...తనను కొందరు వైసీపీ రెడ్లు రూ.లక్ష ఇస్తాం నీ భూమిని వారి పేరిట రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేశారన్నారు. తన తండ్రి లక్ష్మయ్య బతికున్నప్పుడు వారికి అమ్మాడని, ఆ భూ మిని రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి తెచ్చారన్నారు. తన తండ్రి అమ్మిఉంటే తన తండ్రితో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని వారికి ఖరాఖండిగా చెప్పానన్నాడు. అంతేకాకుండా తన తమ్ముడి పిల్లలు ఉన్నారని ఆ భూమిని వారికి అవసరమని తెలిపారు. తనను కిడ్నాప్ చేసిన వారిపై పోలీసులకు పిర్యాదు చేశానన్నారు. ఇది ఇలా ఉండగా కిడ్నాప్ విషయం పత్రికల్లో రావడంతో పెద్దప్పయ్య గంటాపురం గ్రామంలో ఉన్నట్లు సమాచారం అందుకుని స్టేషన్‌కు తీసుకు వచ్చామని, కిడ్నాప్ చేశారా లేదా అన్న విషయంపై విచారణ జరుపుతున్నామని వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం మీడియాకు తెలిపారు.



మాట్లాడుతున్న పెద్దప్పయ్య

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

అనంతపురం విద్య, ఫిబ్రవరి 10: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. నిర్ణీత తేదీల్లో రెండు పూటలా పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు ప్రకటించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరగనున్న ఈ పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 170 జూనియర్ కళాశాలు ఉండగా అందులో 70 జనరల్ ప్రాక్టికల్ పరీక్షా కేంద్రాలు, 10 ఒకేషనల్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎంపీసీ విద్యార్థులు 10,124 మంది, బైపీసీ విద్యార్థులు 2721 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 3186 మంది హాజరుకానున్నారు.

ఓటరు జాబితాలో బయటపడుతున్న తప్పులు



ఒకే వ్యక్తికి రెండు చోట్ల నమోదైన ఓటు

రాయదుర్గం, ఫిబ్రవరి 10: ఎన్నికల కమిషన్ పారదర్శకంగా ఓటర్ల జాబితాను తయారు చేశామని ప్రకటిస్తున్నప్పటికీ లోపాలు మాత్రం ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయి. రాయదుర్గం పట్టణంలో 228 పోలింగ్ కేంద్రంలో శ్రీరాముల శ్రీకాంత్‌కు సీరియల్ నంబర్ 1170లో ఒకచోట, అదే పేజీలో ప్రక్కన 1171 సీరియల్ నంబర్‌లో మరో చోట రెండు ఓట్లు కల్పించారు. ఎస్‌ఆర్ తేజ్‌కుమార్ అనే వ్యక్తికి 227 పోలింగ్ కేంద్రంలో 1012, 1020 సీరియల్ నంబర్లలో ఓటు హక్కు కల్పించారు. 228 పోలింగ్ కేంద్రంలో 387 సీరియల్ నంబర్‌లో కూడా అవకాశం కల్పించారు. కృష్ణకాంత్ అనే యువకుడికి 228 పోలింగ్ కేంద్రంలో 1177 సీరియల్ నంబర్‌లో ఓటు నమోదు కాగా, 227 పోలింగ్‌బూత్‌లో 1013 సీరియల్ నంబర్‌లో మళ్లీ ఓటరుగా నమోదు చేశారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. బెంగళూరులో నివాసముంటూ ఎన్నికలకు మాత్రమే ఓటుహక్కు వినియోగించు కోవడానికి వచ్చే ముగ్గురికి ఏడు చోట్ల అవకాశాలు కల్పించారు.

కొత్త జాబితాలో పాత తప్పులు

బొమ్మనహాళ్ : మరణించిన వారిని, ఊర్లో లేని వారిని, పెళ్లైన వారిని ఓటర్లుగా తుది జాబితాలో ఉంచారు. ఊరు వదిలిపోయినవారు. మరణించినవారు, ఊర్లో లేని వారు, పెళ్లైన వారి పేర్లు ఓటరుజాబితాలో కొనసాగుతున్నాయి. మండలంలోని నేమకల్లు గ్రామంలో 45, 46 కేంద్రాలలో ఓటరు జాబితాను పరిశీలిస్తే 150 మందికిపైగా అనర్హులను ఓటర్లుగా నమోదు చేశారనే విమర్శలు వస్తున్నా యి. కర్ణాటకలో నివాసం ఉంటున్నవారిని జాబితాలో పొందుపరిచారు. సవరణకు ఎక్కువ స్థాయిలో దరఖాస్తులు వచ్చినా పరిశీలించకుండా తుదిజాబితా విడుదల చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎలా బతకాలి నాన్న ?



రైలు కింద పడి రామకృష్ణ ఆత్మహత్య



యాడికి, ఫిబ్రవరి 10: భార్య, కుమార్తెను హత్య చేసిన రామకృష్ణ (28) శనివారం తాడిపత్రి మండలంలోని పెద్దపొలమడ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వారి పెద్దకూతురు శాన్విత ఒంటరిగా మిగిలిపోయింది. ఇకపై తన భవిష్యత్తు ఏమిటో తెలియని పరిస్థితి. ఎల్‌కేజీ చదువుతున్న ఈ నాలుగేళ్ల చిన్నారికి ఇప్పుడు అవ్వాతాత, బంధువులే దిక్కయ్యారు. యాడికి చౌడేశ్వరికాలనీలో భార్య చంద్రావతి, చిన్న కుమార్తె చైత్రికను అతి దారుణంగా చంపి, రామకృష్ణ పరారయ్యాడు. ఈ సంఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. రామకృష్ణ కోసం పోలీసులు గాలిస్తుండగా, పెద్దపొలమడ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. రామకృష్ణ సోదరుడి ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భార్య, కుమార్తెను హత్యచేశానన్న మనస్తాపంతోనే రామకృష్ణ ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అతడి సోదరుడు ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది. తండ్రి క్షణికావేశంతో తల్లిని, చెల్లిని కోల్పోయిన శాన్విత, ఇప్పుడు తండ్రిని కూడా కోల్పోయింది. శాన్విత పరిస్థితిని తలచుకుని స్థానికులు అయ్యో దేవుడా ఈ చిన్నారికి దిక్కెవరు అంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

అప్పులే కారణమా......?

రామకృష్ణ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ఆడేవాడని స్థానికులు చర్చించుకుంటున్నారు. కొద్ది మొత్తంలో అప్పులు కూడా చేసినట్లు తెలిసింది. ఈ అప్పులు తీర్చడానికి రామకృష్ణ సోదరులు సాయం అందిస్తామని హామీ కూడా ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. మరి ఇటువంటప్పుడు రామకృష్ణ భార్యను, కుమార్తెను చంపాల్సిన అవసరం ఏముంది? ఆ తర్వాత రెండురోజులకు రామకృష్ణ ఆత్మహత్య ఎందుకు చేసుకున్నట్లు అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఆత్మహత్యకు పాల్పడ్డ రామకృష్ణ తన కాలిపై నిన్ను, పాపను కాపాడుకోలేక పోయాను నన్ను క్షమించు, అత్తా పాపని బాగా చూసుకోండి అని సూసైడ్ నోట్ ఎందుకు రాసుకున్నాడో అర్థం కాని విషయం. మృతిచెందిన ముగ్గురికీ అంత్యక్రియలు కిష్టిపాడులో నిర్వహించారు.

చికిత్స పొందుతూ చిరుత మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన చిరుత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈనెల 5న మంగళవారం తెల్లవారుజామున పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో చిరుతపులి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. గాయపడ్డ చి రుతను చికిత్స నిమిత్తం తిరుపతి జూ కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం ఉదయం చిరుత మృతి చెందినట్లు డీఆర్‌ఓ శివరాం తెలిపారు.



గాయపడిన చిరుత (ఫైల్)

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి

● సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్ ● సందడిగా జిల్లా 11వ విజ్ఞాన ప్రదర్శన

రాప్తాడు, ఫిబ్రవరి 10: ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఉన్నత స్థాయికి ఎదగాలని సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకుడు శ్రీ స్వరాజ్ పిలుపునిచ్చారు. రాప్తాడు మండలంలోని పంగల్‌రోడ్డు సమీపాన ఆదర్శ పాఠశాలలో శనివారం జిల్లా 11వ సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. సదస్సును గుత్తి డీవైఈఓ శ్రీదేవి ప్రారంభించారు. జిల్లాలోని పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పలు రకాల ప్రాజెక్టుల నమూనాలను ప్రదర్శించారు. మొత్తం 106 ప్రాజెక్టులకుగానూ 91 ప్రాజెక్టులు ప్రదర్శనలో ఉంచారు. సైన్స్‌ఫెయిర్ రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్ అన్ని ప్రాజెక్టులను పరిశీలించారు. ఆర్ట్స్ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రసాద్, రఘువర్మ, శ్రీదేవి, రామకృష్ణ, తదితరులు ప్రాజెక్టులను పరిశీలించి 7 ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. జిల్లా స్థాయి విజేతలను డీఈఓ వరలక్ష్మి ప్రకటించారు. 1. గేణేష్ రెడ్డి హనకనహల్ ఉన్నత పాఠశాల. కనేకల్లు మండలం. 2. చరణ్ ఎన్. నరసాపురం ఉన్నత పాఠశాల గుంతకల్లు మండలం. 3. జ్యోతి కసాపురం గుంతకల్లు మండలం. 4. శకుంతల కరకముక్కల ఉన్నత పాఠశాల విడపనకల్లు మండలం. 5.ప్రణతి బెస్తరపల్లి ఉన్నత పాఠశాల కుందుర్పి మండలం. 6. కీర్తన ఆదర్శ పాఠశాల విడపనకల్లు మండలం. 7. అక్షయ, గాయత్రి తాడిపత్రి. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాలమురళికృష్ణ, రాప్తాడు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పద్మజా దేవి తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు శ్రీ స్వరాజ్

యువత చేతుల్లోనే రాష్ట్ర భవిష్యత్తు

- వైసీపీ పాలనలో కరువైన ఉపాధి అవకాశాలు
- వచ్చే ఎన్నికల్లో ఆలోచించి ఓటు వేయండి
- కొత్తఓటర్లకు పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి

ధర్మవరం, ఫిబ్రవరి 10: రాష్ట్ర భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, ఈ ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో ఒకసారి ఆలోచించాలని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన నియోజకవర్గానికి చెందిన కొంత మంది విద్యార్థులు, కొత్త ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. విద్యారంగంలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. అలాగే ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఓటు నమోదు చేసుకున్న వారికి పరిటాల శ్రీరామ్ పలు సూచనలు ఇచ్చారు. ప్రభుత్వాల్ని గద్దె దించాలన్నా.. అందలం ఎక్కించాలన్నా.. యువత చేతుల్లోనే ఉందన్నారు. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధి అవకాశాలు లేక యువత చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. చాలా మంది పక్క రాష్ట్రాలకు ఉద్యోగాల కోసం వెళ్లారన్నారు. ఈ రాష్ట్రానికి ఏవైనా కంపెనీలు రావాలంటే.. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలకు కప్పం కట్టాల్సిన దుస్థితి ఉందన్నారు. అందుకే పారిశ్రామికవేత్తలంతా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడువైపు చూస్తున్నారన్నారు. అదే చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పరిశ్రమల్ని ఆహ్వానించి ఎంతోమంది యువకు ఉపాధి కల్పించారని గుర్తు చేశారు. దానికి కియలాంటి పరిశ్రమ ఉదాహరణగా చెప్పారు. 2019లో చంద్రబాబు సీఎం కాకపోవడం వల్ల రాష్ట్రానికి చాలా నష్టం జరిగిందన్నారు. మరోసారి ఇలాంటి నష్టం జరగకుండా తొలిసారి ఓటు వేస్తున్న వారంతా టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని పరిటాల శ్రీరామ్ విజ్ఞప్తి చేశారు.


కొత్త ఓటర్లతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్


భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

అలరించిన సంగీత విభావరి

పుట్టపర్తి, ఫిబ్రవరి 10 : తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు సంగీత విభావరి నిర్వహించి అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో శనివారం సాయంత్రం వారు వారు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు గంటపాటు సంగీత వాయిద్యాలు వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని సందర్శించారు.

దేశవ్యాప్త గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయండి

ధర్మవరం, ఫిబ్రవరి 10: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏపీ రైతుసంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్త గ్రామీ ణ బంద్ జరగనుందని, విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి జేవీరమణ పిలుపు నిచ్చారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, కర్షకులకు, కార్మికులకు, పేదలకు, మోటారు వెహికల్‌డ్రైవర్లకు వ్యతిరేకంగా అనేక రకాల ప్రమాదకరమైన చట్టాలు తీసుకొస్తున్నాయన్నారు. వీటికి వ్యతిరేకంగా బంద్‌ను నిర్వహించనున్నామన్నారు. స్వామినాథన్‌కమిషన్ సిఫారసు అమలు చేయాలని, రైతు రుణాలు రూ.2లక్షల వరకు మాఫీచేయాలని, కేరళ తరహాలో రుణవిముక్తి చట్టాన్ని తీసుకురావాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దుచేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.2లక్షలకోట్లు కేటాయించాలని, ఆహార భద్రత చట్టాన్ని తీసుకురావాలని, భూ హక్కుల చట్టం రద్దుచేయాలని, పోలవరం ప్రాజెక్టుకు నిదులు కేటాయించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఇన్‌పుట్, ఇన్సూరెన్స్ ను వెంటనే మంజూరుచేయాలని కోరారు. అదేవిధంగా వ్యవసాయానికి విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేయాలని, మోటార్లకు స్మార్ట్‌మీటర్‌లు బిగించరాదని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్‌బాషా, ఏఐటీయూ నాయకులు వైవిరమణ పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

బత్తలపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని సంజీవపు రం గ్రామంలో శనివారం రా త్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ స మావేశమయ్యారు. ఈ సం దర్భంగా మాట్లాడుతూ... ఈ నెల 14వ తేదీన సంజీవపు రం గ్రామంలో టీడీపీ అధినే త నారా చంద్రబాబు నాయు డి సతీమణి నారా భువనేశ్వరి పర్యటించనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ఆమె పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కమిటీ ఎన్నిక

నల్లమాడ, ఫిబ్రవరి 10: ఎస్టీయూ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు ఎస్టీయూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆసిఫ్ తెలిపారు. మండలకేంద్రంలోని ఎమ్మార్సీలో శనివారం సమావేశం నిర్వహించి కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా పి. ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, కార్యదర్శిగా శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మనోహర్, పుష్పావతి, కార్యదర్శులుగా విశ్వనాథ్, శశికుమార్‌రెడ్డి, కమిటీ సభ్యులుగా ప్రభాకర్, శ్రీరాములనాయక్, సీపీఎస్ కన్వీనర్‌గా అనిల్‌కుమార్, మైనార్టీ కన్వీనర్‌గా సైఫుద్దీన్ బాషా, మహిళ కన్వీనర్లుగా రేణుకాబాయి, రీనాచవాన్‌ను ఎన్నుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆశిష్

ముదిగుబ్బ, ఫిబ్రవరి 10: తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ ధర్మవరం నియోజకవర్గ అధ్యక్షుడిగా ముదిగుబ్బ మండల కేంద్రంలోని పాతూరుకు చెందిన మోపూరి ఆశిష్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ తనను నియమించి .. నియామక పత్రాన్ని అందించారని చెప్పారు. తనపై నమ్మకంతో నియమించినందుకు విధులను బాధ్యతగా నెరవేరుస్తానని పేర్కొన్నారు.


పరిటాల శ్రీరామ్‌తో నియామక పత్రం అందుకుంటున్న ఆశిష్

కేరళలో శిశుసంరక్షణ కేంద్రాల ప్రారంభం

పుట్టపర్తి, ఫిబ్రవరి 10: సత్యసాయి శిశు సంరక్షణ కేంద్రాలను కేరళ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ శనివారం ప్రారంభించారు. కేరళలోని 11జిల్లాల్లో ఏర్పాటు చేసిన శిశుసంరక్షణ కేంద్రాల(అంగన్‌వాడీ కేంద్రాలు)ను ఆయన ప్రారంభించారు. దాదాపు రూ.1.5కోట్ల వ్యయంతో ఈ కేంద్రాలను నిర్మించారు. ఇందులో ప్రతి సెంటర్‌లో 3 నుంచి 5సంవత్సరాల వయసున్న చిన్నారులకు పౌష్టికాహారం, విలువలతో కూడిన విద్యను అందించనున్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యుడు మనోహర్‌శెట్టి, ఆ రాష్ట్ర సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆర్జే రత్నాకర్

మొక్కజొన్న పంటపై విష ప్రయోగం

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10: కాయకష్టం చేసి సాగుచేసిన మొక్కజొన్నపంటపై గుర్తు తెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారని మండలంలోని గౌరాపురానికి చెందిన రైతు ఇరగట్టు లక్ష్మీనారాయణ ఆవేదన చెందారు. బాధిత రైతు శనివారం తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తాను సర్వేనెంబర్ 907, 908లో గల నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగుచేశానన్నారు. పంట చేతికొచ్చేదశలో ఉండగా.. గుర్తుతెలియని వ్యక్తులు విషప్రయోగం చేశారన్నారు. పంటపై విష ప్రయోగం చేసిన విషయాన్ని తాను శనివారం ఉదయం గమనించామన్నారు. ముందురోజు మొక్కలు బాగానే ఉన్నాయని, విషప్రయోగం వల్ల అవి తర్వాత రోజున ఎండిపోయి కనిపించాయని వాపోయారు. దీంతో రూ.లక్ష నష్టం జరిగిందన్నారు. ఘటనపై పోలీస్ స్టేషన్‌లో, తహసీల్దార్‌కు, వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో సాగిన రథయాత్ర

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10: కదిరి సేవా భారతి ఆధ్వర్యంలో ఈనెల 21వ తేదీన కదిరి పట్టణంలో సీతారామ కల్యాణం వైభవంగా జరగనుంది. ఈ ఉత్సవానికి సంబంధించి ప్రచారం చేస్తున్న రథయాత్ర శనివారం మండలంలోని మహమ్మదాబాద్ క్రాస్, వేమారెడ్డిపల్లితో పాటు మండలకేంద్రంలోని ప్రధాన వీధులగుండా సాగింది. రథయాత్ర ఎదుట భక్తులు రామభజనలు చేస్తూ నడిచారు. సేవాభారతి సభ్యులు పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నాగేశ్వరయ్యశెట్టి, పుల్లప్ప, పూజారి వెంకటరమణ , భక్తులు పాల్గొన్నారు.


ఓడీసీలో సాగుతున్న ప్రచార రథయాత్ర

నేడు పెడబల్లిలో టీడీపీ సమావేశం

పుట్టపర్తి, ఫిబ్రవరి 10 : మండలంలోని పెడబల్లిలో ఆదివారం టీడీపీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు 11గంటలకల్లా తరలి రావాలని సూచించారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

ధర్మవరంరూరల్, ఫిబ్రవరి10: మండలంలోని సీసీ కొత్తకోట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆదిరెడ్డి భార్య ప్రమీల(64) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ అనంతపురంలోని వారి నివాసం వద్దకు శనివారం వెళ్లి ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు.

చేనేత కార్మికసంఘం జిల్లా కమిటీలో ధర్మవరం వాసులు

ధర్మవరం, ఫిబ్రవరి 10: చేనేత కార్మికసంఘం జిల్లా నూతన కమిటీలో ధర్మవరం వాసులకు చోటు కల్పించారు. సోమందేపల్లిలోని వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో శుక్రవారం చేనేత మొదటి మహాసభను నిర్వహించారు. ఈ సభలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ చేనేత కార్మికసంఘం జిల్లా నూతన కమిటీని ఎంపిక చేశారు. ఇందులో ధర్మవరానికి చెందిన వెంకట నారాయణను జిల్లాప్రధానకార్యదర్శిగా, పోలా లక్ష్మీనారాయణ, విజయభాస్కర్, చట్టారవివర్ధన్‌ను ఉపాధ్యక్షులుగా, వెంకటస్వామిని గౌరవాధ్యక్షుడిగా, చెన్నంపల్లి శ్రీనివాసులు, కేశవను సహాయ కార్యదర్శులుగా, మల్లికార్జునను కోశాధికారిగా ఎన్నిక చేశారు. నూతనంగా ఎన్నికైన వారు శనివారం మాట్లాడుతూ...చేనేత కార్మికుల సమస్యల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు.

పలు గ్రామాల్లో 'పల్లెకు పోదాం'

నంబులపూలకుంట, ఫిబ్రవరి 10: బీజేపీ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని మండలంలో నివెలిచెలమ, వడ్డిపల్లి, గౌకనపల్లి, దిన్నెమీదపల్లి, తూర్పునడింపల్లి, జౌకల, నల్లగుట్టపల్లి గ్రామాల్లో శనివారం ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. క్యాలెండర్లు పంపిణీ చేశారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డి, నాయకులు నాగరాజు, గురివిరెడ్డి, కదిరిరెడ్డి, సమీవుల్లా, రవీంద్ర, కార్యకర్తలు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంత్యుత్సవాలకు తరలిరండి

ఓబుళదేవరచెరువు, ఫిబ్రవరి 10: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంత్యుత్సవాలను జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం మండలాధ్యక్షుడు రమణానాయక్, జిల్లా కమిటీ సభ్యుడు మోహన్‌నాయక్, సహాయ ఉపాధ్యక్షుడు రమేష్‌నాయక్ కోరారు. మండలకేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో శనివారం వారు బంజారా సేవా సంఘం సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ నెల 13, 14వ తేదీల్లో గుత్తి సమీపంలోని చెర్లోపల్లి వద్ద ఉన్న సేవాఘడ్‌లో సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు జరుగుతాయన్నారు. బంజారాలందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బంజారాలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత మృతి

కదిరి, ఫిబ్రవరి 10: కాంగ్రెస్ సీనియర్ నేత కేఎస్ హుస్సేన్‌పీరా(89) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. మాజీ సీఎం జలగం వెంగళరావు శిష్యుడిగా ఈయన కొనసాగారు. ఉమ్మడి అనంతపురం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఏఐసీసీ సభ్యుడిగా, వక్ఫ్‌బోర్డు సభ్యుడిగా పని చేశారు. పలు పార్టీల నాయకులు పట్టణంలోని ఆయన స్వ గృహానికి వెళ్లి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఏఐవైఎఫ్ నాయకుడికి నోటీసులు

ముదిగుబ్బ, ఫిబ్రవరి10: మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 11వ తేదీన ఏఐవైఎఫ్ రాష్ట్ర కమిటీ సీఎం క్యాంపు కార్యాలయ ముట్టడికి పిలుపునిచ్చింది. అయితే ఆ కార్యక్రమానికి వెళ్లకుండా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బిల్లు కుళ్ళాయప్ప కు, శుక్రవారం అర్ధరాత్రి మండలంలోని మద్దన్నగారిపల్లిలో పట్నం పోలీసులు ముందస్తు నోటీసులు అందించారు. ఈ సందర్భంగా కుళ్లాయప్ప మాట్లాడుతూ, నిరుద్యోగులకోసం పోరాడేవారిని అడ్డుకోవాలని జగన్ ప్రభుత్వం చూస్తోందన్నారు.

సీఎం జగన్ రైతులకు చేసిందేమీ లేదు

- టీడీపీ నాయకులు, రైతులు మండిపాటు

కొత్తచెరువు, ఫిబ్రవరి 10: తమది రైతు ప్రభుత్వమని చెప్పుకునే వైసీపీ ప్రభుత్వం రైతులకు చేసిందేమీ లేదని మండల టీడీపీ నాయకులు, రైతులు మండిపడ్డారు. మండల కేంద్రంలోని గాంధీనగర్ పాఠశాల ఆవరణలో శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ రైతులను అన్ని విధాలా ఇబ్బందులు పెడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కరెంట్ కోతలతో అవస్థలకు గురి చేస్తున్నారన్నారు. 9గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇస్తామని.. ఇప్పుడు 7గంటలకే పరిమితం చేశారని దుయ్యబట్టారు. ఇక విద్యార్థులకు ఇచ్చే అమ్మఒడి రూ.15 వేలు అని చెప్పి.. అందులోనూ రూ. 2 వేలు కోత వేశారని తెలిపారు. ఇలా అన్ని పథకాలలోనూ కోతలు విధిస్తూ ప్రజలను నిండామోసం చేస్తున్నారని విమర్శించారు. కరెంట్ కోతలతో పంటలను సరిగా పండించుకోలేని దుస్థితితో రైతులు ఉన్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రైతులకు సబ్సిడీతో అందించే వ్యవసాయ పరికరాల కూడా కనుమరుగయ్యాయని అన్నారు. అదే టీడీపీ హయాంలో రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లు, ట్రాక్టర్ పరికరాలు, పనిముట్లు అందించారని గుర్తు చేశారు. ఇప్పటికైనా రైతులు మేల్కొని వచ్చే ఎన్నికలలో టీడీపీని గెలిపించాలని వారు కోరారు. పార్టీ మండల కన్వీనర్ రామకృష్ణ, నాయకులు కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, బండ్లపల్లిరాజు, సుబ్బరాయుడు, చంద్ర, పలువురు రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం


ధర్మవరం 3వ వార్డులో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ శ్రేణులు


ముదిగుబ్బ మండలం జొన్నల కొత్తపల్లిలో..

- భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నాయకులు

ధర్మవరం, ఫిబ్రవరి 10: చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం సాధ్యమని, ఆయన సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ పేర్కొన్నారు. పట్టణంలోని 3వ వార్డులో శనివారం వారు టీడీపీ పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంచుతూ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిరమైన పాలన కోసం టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చంద్రబాబు సీఎం అయితే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రజలకు ఎలాంటి మేలు జరగలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓటు అనే వ్యాక్సిన్‌తో రాష్ట్రానికి పట్టిన వైసీపీ వైరస్‌ను తరిమేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు భీమనేనిప్రసాద్‌నాయుడు, రాళ్లపల్లిషరీఫ్, జిలకరశీన, అంబటిసనత్, కరెంటు ఆది, మాదన సుబ్బయ్య, గోసల శ్రీరాములు, బడిగింజల రమణ, బీరే శీన, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ

ముదిగుబ్బ: మండలంలోని జొన్నలకొత్తపల్లి, రాళ్లఅనంతపురం గ్రామాల్లో టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ భవిషత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికీ వెళ్లి ప్రజలకు మినీమేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ పథకాల గురించి తెలియ జేశారు. ఇంట్లో ఎవరెవరికి ఏయే పథకాలు వర్తిస్తాయి. వాటి నుంచి ఏ మేరకు లబ్ధి చేకూరుతుందో వివరించారు. చంద్రబాబు సీఎంను చేసుకుందామని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కరణంప్రభాకర్, నాయకులు సూర్యశేఖర్ రాజు, మహబూబ్‌పీరా, జానీ, నారాయణస్వామి, సూర్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, ఆనంద్, నరేష్, మీసాలరాజు, వెంకటనారాయణ, సోము, కిష్టప్ప, భాస్కర్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో కంటివైద్య, రక్తదాన శిబిరాలు


ధర్మవరంలో ఆర్టీసీ సిబ్బందికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం


పుట్టపర్తిలో రక్తదానం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ధర్మవరం, ఫిబ్రవరి 10: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం రెడ్‌క్రాస్‌సొసైటీ, యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరంతో పాటు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులకు, సిబ్బందికి కంటివైద్యనిపుణుడు నరసింహులు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అదేవిధంగా 30 మంది రక్తదానం చేపట్టారు. రక్తదానం చేసిన వారికి ఆర్టీసీ డీఎం సత్యనారాయణ రెడ్‌క్రాస్ సర్టిఫికెట్, మెమొంటో అందజేశారు. ఆర్టీసీ డీపీటీఓ మధుసూదన్ హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు పోలా ప్రభాకర్, జిల్లా కో ఆర్డినేటర్ రమేశ్, డైరెక్టర్ సత్యనిర్ధారణ్, యువర్స్‌ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోలో శనివారం డీపీటీఓ మధుసూదన్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులు చిట్టిబాబు, శిరీష పాల్గొని రక్తదాన శిబిరం నిర్వహించారు. 33మంది సిబ్బంది రక్తదానం చేశారు. డీపీటీఓ మాట్లాడుతూ రక్తదానం చేయడంవల్ల ఎలాంటి నష్టం ఉండదని, మరొకరి ప్రాణాన్ని కాపాడేందుకు వీలుంటుందని తెలిపారు. డ్రైవర్లువాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. డీఎం ఇనాయతుల్లా, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి: రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా పట్టణానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగులు 20 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కదిరి ఉద్యోగులు పాల్గొని రక్తదానం చేపట్టారు. అనంతరం వారిని డిపో మేనేజర్ మెనోద్దీన్ అభినందించారు.


ఆంజనేయస్వామి ఆలయంలో కందికుంట యశోదమ్మ

ఆంజనేయస్వామిని దర్శించుకున్న కుందికుంట యశోదమ్మ

నల్లచెరువు, ఫిబ్రవరి 10: మండలంలోని పాలపాటి దిన్నె ఆంజనేయస్వామిని టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సతీమణి యశోదమ్మ శనివారం దర్శించు కున్నారు. ఆలయం వద్దకు రాగానే అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆమె స్వామి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు చేయించారు. తర్వాత ప్రచార వాహనానికి పూజలు చేయించారు. ఆమె వెంట పార్టీ మండల కన్వీనర్ రాజశేఖర్, మాజీ ఎంపీపీ మాబూసాబ్, నాయకులు అంజనప్ప, అశ్వర్థనాయుడు తదితరులు ఉన్నారు.

ప్రమాదాల రహదారి

- స్పీడ్‌బ్రేకర్ల వద్ద కానరాని సూచిక బోర్డులు
- చిగిచెర్ల క్రాస్ వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలతో వాహనదారుల మృత్యువాత
- పట్టించుకోని అధికారులు
- స్పీడ్‌బ్రేకర్ల వద్ద రేడియం స్టిక్కర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు


చిగిచెర్ల క్రాస్ వద్ద సూచికబోర్డులు లేక ప్రమాదానికి కారణమవుతున్న స్పీడ్‌బ్రేకర్

ధర్మవరం రూరల్, ఫిబ్రవరి 9: ప్రధానరహదారుల్లో స్పీడ్‌బ్రేకర్ల వద్ద సూచికబోర్డులు, రేడియం స్టిక్కర్లు లేకపోవడంతో వాహనదారులకు రాత్రివేళల్లో కనిపించక అదుపుతప్పి ప్రమాదాలకు గురై మృత్యువాతపడుతున్నారు. ముఖ్యంగా మండలంలోని ధర్మవరం నుంచి చిగిచెర్ల మీదుగా అనంతపురానికి వెళ్లే ప్రధానరహదారిలో ఈ పరిస్థితి అధికంగా ఉంది. ఆ రోడ్డులో ఎక్కడా కూడా ప్రమాదాల గురించి తెలిపే సూచిక బోర్డులు లేవు. నిత్యం వందలాదిగా ద్విచక్రవాహనాలు, లారీలు, బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే స్పీడ్‌బ్రేకర్ల వద్ద సూచికబోర్డులు లేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. చిగిచెర్ల క్రాస్ గ్రామ బస్టాండ్ వద్ద మూడు స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయి. అయితే ఆ ప్రాంతంలో అవి ఉన్నట్లు సూచించే బోర్డులు లేవు. అదేవిధంగా ఆ స్పీడ్‌బ్రేకర్లుకు రెడ్‌కలర్ కలిగిన రేడియంస్టిక్కర్లు లేవు. దీంతో చీకటిపడగానే ద్విచక్రవాహనదారులకు చాలా దగ్గరకు వచ్చేంతవరకు ఆ స్పీడ్‌బ్రేకర్లు కనిపించక వేగంతో ఆ ప్రాంతంలో అదుపుతప్పి రోడ్డు ప్రమాదలకు గురవుతున్నారు.

చిగిచెర్ల క్రాస్ వద్ద జరిగిన పలు రోడ్డు ప్రమాదాలు..

- ఇటీవలకాలంలో బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి యువకుడు పోతులరాజు తన ద్విచక్రవాహనంలో వేగంగా వస్తూ స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుచేయలేక అక్కడే ఉన్న చిన్నారి షర్మిలను ఢీకొట్టగా ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు.
- ఈనెల 2వ తేదీన ధర్మవరం పట్టణంలోని కోట బసవన్నవీధికి చెందిన మిడతల అశోక్ బైక్‌లో అనంతపురానికి వెళ్లి తిరిగి ధర్మవరం వస్తుండగా చిగిచెర్ల క్రాస్ వద్ద స్పీడ్‌బ్రేకర్ వద్ద అదుపుతప్పి ఎగిసిపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు.
- గత నెల 6న అనంతపురానికి చెందిన గోపాల్ అనే యువకుడు ద్విచక్ర వాహనంలో వస్తూ రాత్రివేళలో స్పీడ్‌బ్రేకర్ కనిపించక ఎగిసిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.
- అదేవిధంగా గరుడంపల్లి క్రాస్ వద్ద స్పీడ్‌బ్రేకర్ల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేవు. అక్కడ కూడా తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు తెలుపుతున్నారు.

అధికారుల చర్యలేవీ?

ప్రమాదాలు జరగడానికి ఆ ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు ఉన్నట్లు ఎటువంటి సూచికబోర్డులు లేవు. వాటితో పాటు బ్రేకర్ల వద్ద రేడియంస్టిక్కర్లు లేకపోవడంతో వాహనచోదకులకు కనిపించక ప్రాణాలు కోల్పోవుతున్నారు. ప్రమాదాలు ఆ ప్రాంతంలో జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఒకే ప్రాంతంలో రోడ్డుప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారుల్లో చలనం రాలేదని వాపోతున్నారు. ఇదివరకే గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. వీటిపై తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరినా అధికారులు, పోలీసులు పట్టించుకోవడం లేదని చిగిచెర్ల గ్రామస్థులు మండిపడుతున్నారు. ఈ రహదారిలో కొత్తవారు ప్రయాణిస్తే ప్రమాదానికి గురవుతున్నారంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్ ఉన్నట్లు తెలిసేవిధంగా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

చోళమాంబదేవికి ప్రత్యేక పూజలు


అలంకరణలో అమ్మవారు

మడకశిర టౌన్, ఫిబ్రవరి 10: అమరా పురం మండల కేంద్రంలో వెలిసిన చోళమాంబదేవి జాతర మహోత్సవంలో భాగంగా శనివారం ప్రత్యేక అలంకరణ లో అమ్మవారు కొలువుదీరారు. తొలిరోజు ఉదయం వినా యక పూజతో ఉత్సవాన్ని ప్రారంభించారు. దాదాపు 102 సంవత్సరాల తరువాత పెద్దఎత్తున జాతర మహోత్సవం నిర్వహిస్తున్నందున అనేక మంది భక్తులు తరలివచ్చి అమ్మవారికి ఘనంగా పూజలు చేశారు. ఆలయంలోనే ఉన్న అభయ ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం చేసి వెన్నతో అలంకరించారు. ఆకుపూజ చేశారు. ఆదివారం ఉదయం 5.30 గంటల నుంచి గోపుర కలశ ప్రతిష్ఠాపన, చోళమాంబ దేవతకు విశేష పూజలు, అర్ధరాత్రి నుండి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో ఊరేగింపు, జలది మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు.

నేడు బైక్ ర్యాలీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10: ఏకశిల ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా పట్టణంలో ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. 14వ తేదీన పట్టణంలోని మేళాపురం బైలాంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేయనున్న 27 అడుగుల ఏకశిలా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టనున్నట్లు తెలిపారు. ముం దుగా దండురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద నుంచి మేళాపు రం, ఆర్టీసీ బస్టాండ్, రిలయన్స్ పెట్రోల్ బంక్, శ్రీకంఠపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద 101 టెంకాలు కొట్టి అక్కడ నుంచి బయలు దేరుతారన్నారు. అనంతరం చిన్నమార్కెట్, వాల్మీకి సర్కిల్ మీదుగా సూగూరు ఆంజనేయస్వామి ఆలయం వద్దకు చేరుకొని అక్కడ 101 టెంకాయిలు కొట్టి మేళాపురం బైలాంజనేయ ఆలయం వద్ద ముగుస్తుందన్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని వారు కోరారు. అదే విధంగా 14వ తేదీన విగ్రహ ప్రతిష్ఠకు భారీగా తరలిరావాలన్నారు.

16న మండల సమావేశం

అగళి, ఫిబ్రవరి 10 : అగళి మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 16వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సమావేశం ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున మండలంలోని అధికార ప్రజాప్రతినిధులు కోఆప్షన్ మెంబర్లు జెడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచులతోపాటు మండలంలోని అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. లేనిచో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10: మండలంలోని గుట్టూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సవిత ఆధ్వర్యంలో శనివారం గర్భవతులకు పౌష్టికాహారం అందించినట్లు వైద్యాధికారి నాగరాజునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన గర్భవతులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. అనంతరం 14నెలల నుంచి ఆరోగ్య కేంద్రానికి వస్తున్న గర్భవతులకు ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ సవిత ఆధ్వర్యంలో అన్నదానం చేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారన్నారు.

సోదాల పేరుతో మహిళను దుర్భాషలాడిన కానిస్టేబుల్

లేపాక్షి, ఫిబ్రవరి 10: కర్ణాటక మద్యం అమ్ముతున్నారంటూ ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఇంట్లో ఉన్న మహిళపై కానిస్టేబుల్ దుర్భాషలాడాడని మామిడిమాకులపల్లి గ్రామంలో సుజాత అనే మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె భర్త లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల మేరకు కంచిసముద్రం పంచాయతీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న కానిస్టేబుల్ శుక్రవారం సాయంత్రం ఇంట్లోకి వచ్చి భార్యతో ఇష్టానుసరంగా దుర్భాషలాడాడన్నారు. మద్యం అమ్ముతున్నట్లు పత్రికలో రాయలేని భాషలో విరుచుకుపడ్డాడన్నారు. తమపై పది రోజుల నుంచి రోజూ దాడులు చేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భయపడిన మహిళ అనారోగ్యానికి గురికాగా హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సోమవారం జరిగే గ్రీవెన్స్‌లో ఎస్పీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెనుకొండ రూరల్, ఫిబ్రవరి 10: పట్టణంలోని బీటీఆర్ కాలనీకి చెందిన గిరి(30) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు బంధువులు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని బీటీఆర్ కాలనీకి చెందిన గిరి జనవరి 24న ఇంటి మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య మీన, ఇద్దరు కుమారులున్నారు.

వెటర్నరీ డాక్టర్ శివశంకర్ నాయక్‌కు ఉద్యోగోన్నతి

హిందూపురం, ఫిబ్రవరి 10: స్థానిక వెటర్నరీ డీడీ కార్యాలయంలో పనిచేస్తున్న డా.శివశంకర్‌నాయక్‌కు వెటర్నరి ఏడీగా ఉద్యోగోన్నతి లభించింది. కొడిగెనహళ్లి వెటర్నరి డాక్టర్‌గా ఉంటూ స్థానిక డీడీ కార్యాలయంలో విధులు నిర్వహించేవారు. శుక్రవారం వెటర్నరి ఏడీగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అంతేకాక పెనుకొండ ఏడీగా బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పదేళ్లుగా హిందూపురం, పరిగి ప్రాంతాల్లో రైతులకు సేవలందించారని తనకు పాడి రైతులు పశువుల రైతులు ఎంతో సహకరించారన్నారు.

భువనేశ్వరి పర్యటనను విజయవంతం చేయండి

బత్తలపల్లి, ఫిబ్రవరి 10: మండలంలోని సంజీవపురం గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఈనెల 14వ తేదీన సంజీవపురం గ్రామంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడి సతీమణి నారా భువనేశ్వరి పర్యటించనున్నట్లు చెప్పారు. నాయకులు, కార్యకర్తలు ఆమె పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.


గోరంట్ల: ప్రత్యేక అలంకరణలో కస్తూరి రంగనాథస్వామి


మడకశిరలో ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరుడు, షిర్డీసాయిబాబా

మాఘమాసం పూజలు ప్రారంభం

గోరంట్ల, ఫిబ్రవరి 10: మండలంలోని శివాలయాలు, అన్ని ప్రధాన ఆలయాల్లో మాఘమాస ప్రత్యేక పూజ లను శనివారం ప్రారంభించారు. భక్తులు ప్రతిరోజు వేకు వజామున మాఘస్నానాలు ఆచరించి దైవదర్శనం చేసుకుంటారు. నెలరోజులపాటు పవిత్రంగా పూజలు నిర్వ హించి మహాశివరాత్రి రోజున ఉపవాస దీక్ష, జాగరణ చేస్తే కైలసనాథుడి అనుగ్రహం లభిస్తుం దని భక్తుల నమ్మకం. దీంతో గోరంట్లలో అధిక సంఖ్యలో మాఘమాస దీక్షలను ఆచరిస్తున్నారు. కొంతమంది శివమాల ధరిం చారు. వానవోలు గ్రామంలోని రంగనాథ స్వామిని అర్చ కులు శ్రీధర్‌ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.

మడకశిర టౌన్: మాఘమాసం తొలిరోజు శనివారం పట్టణంలోని కోటవెంకటేశ్వరస్వామి, మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, వీరభద్రేశ్వరస్వామి, భోగరామలింగేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వరస్వామి, షిర్డీసాయినాథుడు, మూలకంఠేశ్వరి, పూజమ్మదేవి తదితర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వెంకటేశ్వరస్వామికి ప్రాకారోత్సవం నిర్వహించారు. చంద్రమౌళేశ్వరస్వామిని అభిషేకించి వివిధ పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చైర్‌పర్సన్ తొలి సంతకం ఏమైంది..?

- వైసీపీ పాలనలో పురంలో అభివృద్ధి ఏదీ..?
- అభివృద్ధి చేశారనే మళ్లీ బాలయ్యను ఎన్నుకున్నారు
- విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10: గత ఎన్నికల్లో హిందూపురం చైర్‌పర్సన్‌గా ఇంద్రజను ఎన్నుకున్న తరువాత ఆమె తొలి సంతకం రోడ్ల వెడల్పుపైనే చేశారని, మరి ఆ తొలి సంతకం ఏమైందని టీడీపీ నాయకులు ప్రశ్నించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి అంబికా లక్ష్మీనారాయణ, పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్ తదితరులు శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వైసీపీ నాయకులు శుక్రవారం ప్రెస్ మీట్‌కు కౌంటర్ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కౌన్సిల్ ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటికి వరకు పట్టణంలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని చైర్‌పర్సన్‌ను, వైసీపీ కౌన్సిలర్లను ప్రశ్నించారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లా తొమ్మిది నెలలు అయిందని పురంలో అభివృద్ధి కనుచూపు మేర కనిపంచలేదని ఎద్దేవా చేశారు. పురంలో ఏం అభివృద్ధి చేశారంటూ కౌన్సిల్ సమావేశాన్ని వైసీపీ కౌన్సిలర్లే అడ్డుకుంటే వారికి కనీసం సమధానం చెప్పలేని మీరు, టీడీపీ గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. పార్టీ అధికారంలో లేకున్నా మా ఎమ్మెల్యే బాలకృష్ణ సొంత నిధులతో రూ. కోట్లు వెచ్చించి కరోనా సమయంలో ఆసుపత్రికి మంచాలు, కరోనా కిట్లు, మందులు అందించారన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మెప్పు కోసం కాకుండా అభివృద్ధికి పాటు పడాలన్నారు. ఏదైనా విజ్ఞతతో మా ట్లాడటం నేర్చుకోవాలన్నారు. పురంలో ఏ రోడ్డు చూసినా గుంతల మయమ న్నారు. వైసీపీలోని ఒక పెద్దాయన ఎప్పుడు ఏ వర్గంలో ఉంటాడో, ఏం మాట్లాడుతాడో ఆయనకే తెలియదన్నారు. పురంలో అభివృద్ధి జరుగకుంటే ప్రజలు 40 ఏళ్లుగా టీడీపీకి ఎందుకు పట్టం కడుతురన్నారని అన్నారు. పురానికి పీఏబీఆర్ నీళ్ల తెచ్చింది రాజశేఖర్‌రెడ్డి అన్నారని, అయితే అరగంటకో లీకేజీతో నీరు సక్రమంగా సరఫరా కాక పురం ప్రజలు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. వాటి మరమ్మతులకే ప్రజాధనం వృథా చేశారన్నారు. అయితే మా ఎమ్మెల్యే రూ.190 కోట్లతో గొల్లపల్లి నుంచి నీటిని అందించి పురం ప్రజల దాహార్తి తీర్చారని, ఆ నీటినే వైసీపీ కౌన్సిలర్ల వార్డుల్లోనూ సరఫరా చేస్తున్నార న్నారు. పోచనపల్లిలో బ్రిడ్జి పడిపోయి ఆ ప్రాంత ప్రజలు పడుతు అవస్థలు మీకు కనిపించలేదా అన్నారు. ఇసుక దోపిడీ కోసం మీరు కొత్త నిబంధనలు తెచ్చి కార్మికులకు పనులు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దిరెడ్డి వస్తున్నాడని బాలయ్య పురానికి రావడం లేదన్నారు. ఆయనకు, ఆయన కార్యకర్తలకు భయమేంటో తెలిదన్నారు. బ్లాక్ మెయిల్ రాజకీయాలకు, పోలీసు కేసులకు భయపడమన్నారు. మీరు ఆయన వార్డులో అభివృద్ధి చేసి ఉన్నింటే వైసీపీ కౌన్సిలర్ టీడీపీలోకి ఎందుకొచ్చేవారన్నారు. తూమకుంట పారిశ్రామిక వాడను ఏర్పాటు చేసింది మా దివంగత నేత ఎన్టీఆర్ అన్నారు. అలాంటి ఒక మంచి పని మీ వైసీపీ చేసిందా అని ప్రశ్నించారు. ఇంకో మారు మతి లేకుండా మా బాలయ్య గురించి మాట్లాడితే ప్రజలే మీకు బుద్ధి చెబుతారని. త్వరలోనే మిమ్మల్ని తరిమేస్తారని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లకుంట అంజనప్ప, లీగల్‌సెల్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, టీడీపీ కౌన్సిలర్లు ఋవేంద్ర, సతీష్, మాజీ కౌన్సిలర్ హిదయతుల్లా, హెచ్ఎన్ రాము, ఆర్ఎంఎస్ షఫీ, పరుశురాం, వైటీపీ ఎంకటరమణ, ఇందాద్, రమణ తదితరులు ఉన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

- యువత చూపు సైకిల్ పార్టీ వైపు
- రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, ఫిబ్రవరి 10: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక యువత పూర్తిగా ఉపాధి అవకాశాలు కోల్పోయిందని చంద్రబాబు వల్లే యువతకు భవిషత్తు అని తెలుగుదేశంలోకి భారీగా యువత చేరుతున్నారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో మడకశిర పట్టణంతోపాటు ఆమిదాలగొంది, హరేసముద్రం పంచాయతీ పరిధిలో దాదాపు వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు యువత కోసం కియా పరిశ్రమలు తెచ్చి లక్షల మందికి భవిషత్తు ఇచ్చారని, మరోసారి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే తమకు భవిషత్తు అని తెలుగుదేశం వైపు యువత మొగ్గు చూపుతున్నారని అన్నారు. వైసీపీకి చెందిన రామకృష్ణ, శివకుమార్, తిమ్మరాజు, రాజశేఖర్, సంతోష్, నరసింహ, మధు సంపత్, శ్రీరామప్ప, భారతి, వినోద్, అశోక్, చౌదప్ప, చంద్రశేఖర్, సురేష్, లోకేష్, సుధాకర్‌రెడ్డితోపాటు వారి అనుచరులు దాదాపు వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నాయి.


టీడీపీలో చేరుతున్న ఆర్‌బీఐ రిటైర్డ్ డైరెక్టర్ దేవరాజు తదితరులు

ఎన్నికల ముందు వైసీపీకి షాక్:

వైసీపీ పార్టీకి చెందిన రిటైర్డ్ ఆర్‌బీఐ డైరెక్టర్ దేవరాజు, రిటైర్డ్ ఓరియంటల్ బ్యాంకు జనరల్ సెక్రెటరీ తిప్పేస్వామి, రిటైర్డ్ ఆర్‌బీఐ జనరల్ సెక్రెటరీ లక్ష్మీనరసింహస్వామి, గుడిబండ మండలం నుండి వైసీపీకి చెందిన ముఖ్య నాయకులు టీడీపీ పార్టీలోకి చేరారు. ఈసందర్భంగా జిల్లా మైనారిటీ అధ్యక్షులు భక్తర్, జిల్లా అధికార ప్రతినిధి నాగరాజు, పట్టణ అధ్యక్షులు మనోహర్, గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, కౌన్సిలర్ ఉమాశంకర్, నాయకులు కోట్ల రంగేగౌడ్, మల్లికార్జున, రఘురాం, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కండి: డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10: రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని కాపాడుదామని డీఎస్పీ కన్జక్షన్ పేర్కొన్నాడు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ఆర్టీసీ కార్యాలయం వద్ద డ్రైవర్‌లకు, సిబ్బందికి అవగామనా కార్యక్రమం నిర్వహించారు. వాహనాలు నడిపే టప్పుడు తీసుకోవాల్సిన జాగ్రతత్తలు వివరించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ శ్రీకాంత్ ముందుగా రక్తదాఎనం చేసి స్ఫూర్తిగా నిలిచారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, ఆర్టీసీ మెడికల్ ఆఫీసర్ అపర్ణ, ఎంవిఐ జయశ్రీ యాదవ్, , ఏఎంటీ హంపన్న, నిషాంత్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, మారెప్ప సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి


భక్తిగీతాలు ఆలపిస్తున్న భక్తులు

పుట్టపర్తి, ఫిబ్రవరి 10: తెలంగాణ రాష్ట్రం ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన సత్యసాయి భక్తులు సంగీత విభావరి నిర్వహించి అలరించారు. పట్టణంలోని ప్రశాంతి నిలయంలో గల సాయి కుల్వంత్ హాల్లో శనివారం సాయంత్రం వారు వారు సంగీత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు గంటపాటు సంగీత వాయిద్యాలు వాయిస్తూ భక్తిగీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం వారు సత్యసాయి మహాసమాధిని సందర్శించారు.

పాత సీసాలో కొత్త సారా అన్నట్లు విద్యాశాఖ రూల్స్

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 10: పాత సీసాలో కొత్త సారా అన్నట్లు విద్యాశాఖ రూల్స్ ఉన్నాయని ఏపీ పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద శనివారం మునిసిపల్ ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... రెవెన్యూ జిల్లాలోని మునిసిపాలిటీలు, కార్పొరేషన్ల, గ్రేటర్ కార్పొరేషన్లకు ఇటీవల ప్రత్యేక సర్వీసు రూల్స్‌ను విడుదల చేశారన్నారు. అయితే రాష్ట్రంలోని 121 మునిసిపాలిటీలను కలిపి మునిసిల్ యూనిఫైడ్ సర్వీసు రూల్స్ ఇవ్వకపోవడం, మునిసిపల్ ఉపాధ్యాయులకు సబార్డినేట్ సర్వీసు రూల్స్‌లో మునిసిపల్ ఎడ్యుకేషన్ అధికారి, డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి పో స్టుల ప్రస్తావన లేకపోవడం పట్ల మునిసిపల్ ఉపాధ్యాయులు తీవ్రంగా వ్యతి రేకిస్తున్నారన్నారు. ఇలాంటి రూల్స్‌తో ఉపాధ్యాయులకు తీరని అన్యాయం జరు గుతుందన్నారు. ఇలాంటి రూల్స్‌తో మునిసిపల్ ఉపాధ్యాయులకు లెక్చరర్లుగా , డీఈఓలుగా, డిప్యూటీ డీఈఓలుగా, డీఈఓ కార్యాలయాల్లో పని చేసే అవకాశా లు లేకుండా పోయాయన్నారు. సింగల్ ఆర్డర్‌తో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు కూడా మునిసిపల్ పాఠశాలల్లో వచ్చి చేరే అవకాశాలు ఉన్నాయన్నారు. దీంతో మునిసిపల్ ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల విషయంలో ఆలస్యం కావడమే కాకుండా తీరని అన్యాయం జరుగుతుందన్నారు. జిల్లా విద్యాశాఖ ఇప్పటికే తీసు కున్న క్రమశిక్షణ చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య కార్యవర్గ సభ్యులు హాజరై నిరసన తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి సిద్దగిరి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెన్నోబులం, గౌరవాధ్యక్షుడు బాలనారాయణస్వామి, కార్యదర్శి బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, జిల్లా కౌన్సిలర్‌లు జనార్ధన్, హరిప్రసాద్, అన్సర్, హరీష్, నగేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఉపాధ్యాయులు

అభివృద్ధిపై వైసీపీ నాయకులు మాట్లాడటం విడ్డూరం


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

లేపాక్షి, ఫిబ్రవరి 10 : అభివృద్ధిపై వైసీపీ నాయకులు మాట్లాడటం చాలా విడ్డూరంగా ఉందని టీడీపీ మండల కన్వీనర్ జయప్ప పేర్కొన్నారు. స్థానిక ఆర్‌జేహెచ్ ఫంక్షన్‌హాల్‌లో ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయప్ప మాట్లాడు తూ... ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ స్థానికంగా లేడని, అభివృద్ధి మరిచారని వైసీపీ నాయకులు మాట్లాడడం చాలా బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ఏం అభివృద్ధి చేశారనేది కళ్లు తెరిచి చూస్తే తెలుస్తుందన్నారు. ఆయన తన సొంత నిధులతో ఎన్నో ఆలయాల అభివృద్ధికి విరాళాలు ఇచ్చారని, కొన్నేళ్లుగా ఆగిపోయిన గలిబిపల్లి రోడ్డును నిర్మించారని తెలిపారు. ఆయన సహకా రంతో కరోనా సమయంలో పేదలకు నిత్యవసర సరుకులు అందించి అందరి మన్ననలు పొందా మన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండి కూడా వైసీపీ అభివృద్ధిని మరిచిందని దుయ్యబట్టారు. నిజాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని వైసీపీ నాయకులకు హితవుపలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ ఎంపీపీ ఆనంద్‌కుమార్, మారుతిప్రసాద్, రామాంజనమ్మ, ఈడిగ రమేష్, అంగడి అంజి తదితరులు పాల్గొన్నారు.

సజావుగా నవోదయ ప్రవేశ పరీక్ష


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

లేపాక్షి, ఫిబ్రవరి 10 : స్థానిక నవోదయ పాఠశాలలో 9, 11 తరగతి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకోసం శనివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. 9వ తరగతికి 1003మంది దరఖాస్తు చేసుకోగా 789మంది హాజరయ్యారు. 11వ తరగతి కోసం 619మంది దరఖాస్తు చేసుకోగా 410మంది హాజరయ్యారన్నారు. 9వ తరగతి ప్రవేశం కోసం నవోదయ పాఠశాలలో ప్రవేశపరీక్షలునిర్వహించామని, 11వ తరగతి ప్రవేశం కోసం ఏపీఆర్‌జేసీలో ప్రవేశ పరీక్ష నిర్వహించామని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు.



హిందూపురం: నవోదయ గేటు ఎదుట కిక్కిరిసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

ఘనంగా సరస్వతి పూజ


సరస్వతి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

అగళి, ఫిబ్రవరి 10: అగళి మండలకేంద్రంలోని బీసీ హాస్టల్‌వార్డెన్ సికిందర్‌బాష ఆధ్వర్యంలో సిబ్బంది, విద్యార్థులు సరస్వతిపూజ శనివారం ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి పరీక్షలు మార్చిలో జరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులకు వీడుకోలు పలికేందుకు విద్యార్థులు సరస్వతిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డెన్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అప్పుడే తల్లిదండ్రులకు గురువులకు హాస్టల్ నుంచి పేరు తెచ్చిన వారు అవుతారని తెలిపారు. మంచి విద్యావంతులుగా ఎదిగి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జాఫర్, ఉపాధ్యాయులు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్ రైడర్లను అడ్డుకున్న పోలీసులు


పెద్దఎత్తున చేరుకున్న బైక్ రైడర్లు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 10 : శ్రీలక్ష్మీ నరసింహస్వామి కొండపైకి వెళ్లకుండా బైక్‌రైడర్లను పోలీసులు అడ్డుకున్నారు. శనివారం బెంగళూరుకు చెందిన పలువురు బైక్ రైడర్లకు వీకెండ్ కావడంతో పెద్దఎత్తున వచ్చారు. ఈ క్రమంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కొండపై 7కి.మి. మేర బైక్ రైడింగ్ చేసేందుకు వెళ్తున్న రైడర్లను ఎస్ఐ రాజేష్ అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఇటీవల బైక్ రైడర్లను ప్రమాదం చోటుచేసుకోవడం, అలాగే పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉండటంతో రైడర్లను అడ్డుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు. చేసేదేమిలేక బైక్ రైడర్లు వెనుతిరిగి వెళ్లిపోయారు.

పావగడ సూపర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో పది జట్లు

పావగడ, ఫిబ్రవరి 10: న్యూ అంజన్ క్రీడా యువక సంఘం కర్ణాటక రాష్ట్ర నౌకర్ల సంఘం ఆధ్వర్యంలో పావగడ సూపర్ ప్రీమియర్ లీగ్‌లో పది జట్లు తలపడ నుండి మూడు రోజులపాటు క్రికెట్ ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షులు అంజన్ తిమ్మరాజు, ఉపాధ్యక్షులు కె.వి.రమేష్, మేనేజర్‌లు అలుకుందరాజ్‌లు తెలియజేశారు. మూడురోజులపాటు నిర్వహించే ఈ ఆటల పోటీల్లో పావగడలో ఎన్నడూ లేని విధంగా మొదటి బహుమతి రూ.2లక్షలు, ట్రోఫీ, రెండవ బహుమతి రూ.1లక్ష ట్రోఫీ అందిస్తుండంతో ఆటల పోటీలకు తీవ్ర పైపోటీ పెరిగింది. యూట్యూబ్ ద్వారా ఈఆటల పోటీలను వైరల్ చేస్తుండి చివరి రోజైన ఆదివారం ఫైనల్ మ్యాచ్ ఉండటంతో ఆటల పోటీలకు అత్యధిక టీమ్‌లు పాల్గొనే అవకాశం ఉందని వారు తెలిపారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతున్నట్లు మేనేజర్‌లు శ్రీనివాసనాయక, రాఘవేంద్ర, లోకేష్, యతీష్‌కుమార్ తెలియజేశారు.

నేడు ఎస్సీ, ఎస్టీ హిత రక్షణసభ

పావగడ, ఫిబ్రవరి 10: పావగడ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీల హిత రక్షణ సభ జరుగుతున్నట్లు సీఐ సురేష్ తెలియజేశారు. ప్రతి నెలా రెండో ఆదివారం పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సీ ఎస్టీ జనాభాకు చెందిన సమస్యలపై పోలీసులు, దళిత నాయకుల సమక్షంలో ముఖాముఖి చర్చలు జరుగుతుండటంతో తమ సమస్యలను అక్కడే పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈసభ జరగనుండి ఎస్సీ ఎస్టీ కు చెందిన నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.